క్లుప్తంగా

వీరాంజనేయునికి శాకంబరి అలంకారం



శాకంబరి అలంకారంలో స్వామి

ముత్తుకూరు : వీరాంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ముత్తుకూరులోని వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామి శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీప కాంతులతో అలంకరించిన ఆలయంలో వేద పండితులు స్వామిని వివిధ కూరగాయలు, తిను భండారాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పంచేటి చంద్రమోహన్‌కుమార్, పంచేటి హేమంత్‌లు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించండి

• జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): 'స్పందన' అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మతో కలిసి 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందజేసిన వినతి పత్రాలను జేసీ స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంబంధించి ప్రజా సమస్యలపై అవసరమైతే తనిఖీ చేసి పరిష్కారమార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఓ, మెప్మా, హౌసింగ్, ఐసీడీఎస్ పీడీలు కె.సాంబశివారెడ్డి, రవీంద్ర, వెంకటదాస్, సౌజన్య, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీపీఓ సుస్మిత, డీఈఓ గంగాభవాని, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

• క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని మహిళా క్రీడాకారులకు మద్దతుగా ఇన్‌సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్, కార్యదర్శులు అహ్మద్ తదితరులు జేసీ కూర్మనాథ్‌కు వినతి పత్రం అందజేశారు.

• దివ్యాంగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ బాబూయాదవ్‌తోపాటు పలువురు జేసీకి వినతిపత్రం అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): తనపై అలిగి భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో భర్త ఆత్మహత్యచేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు..బోగోలు మండలం పాతబిట్రగుంటకు చెందిన పీ వెంకటకృష్ణ(45), కావ్య దంపతులు. వారికి 8 ఏళ్ల క్రితం వివాహమైంది. ఒక కుమార్తె. కొంతకాలం క్రితం నెల్లూరు వచ్చారు. వైఎస్సార్‌నగర్‌లో ఉంటూ దంపతులు ఇద్దరూ బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏడాది క్రితం వెంకటకృష్ణ బంధువుల వద్ద అప్పు చేసి, భార్య నగలు కుదువపెట్టి వైఎస్సార్‌నగర్‌లో ఓ ఇంటిని కొన్నాడు. అప్పు తీర్చాల్సి ఉండగా అందుకు భిన్నంగా వెంకటకృష్ణ సంపాదించిన మొత్తాన్ని జల్సాలు చేయసాగాడు. ఈ విషయమై దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. దీంతో కావ్య జరిగిన విషయాన్ని తన అత్త, ఆడబిడ్డకు తెలియజేసింది. వారు సైతం వెంకటకృష్ణను మందలించారు. అయినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. ఈ నెల 20న ఆయన భార్యతో తీవ్రంగా గొడవపడ్డాడు. దీంతో కావ్య జరిగిన విషయాన్ని తన మరదలకు తెలియజేసింది. ఆమె మరుసటిరోజు వస్తానని చెప్పింది. భర్త వేధింపులు తాళలేక ఈ నెల 21న వేకువజామున కావ్య తన అన్న మహేష్‌కు ఫోన్‌చేసి తన కుమార్తెను తీసుకుని జగదేవిపేటలోని పుట్టింటికి వెళ్లింది. భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో ఆదివారం రాత్రి వెంకటకృష్ణ తన ఇంట్లోని సీలింగ్‌ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం మరదలు ద్వారా తెలుసుకున్న కావ్య హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు ఆమె వేదాయపాళెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వృద్ధురాలికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు : తమ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వడ్లపూడి, గొట్లపాళెం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి సోమవారం నిర్వహించారు. తొలుత వీరంపల్లి నుంచి వడ్లపూడి వరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. వడ్లపూడిలోని పొన్నూరమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా? అని గ్రామస్తులను ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మరో వారంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తవుతుందని, తరువాత ఇందులో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా చర్యలు చేపడతామన్నారు. ఈ దిశగా ఇప్పటికే పనులు ప్రారంభించామన్నారు. తమది శిలాఫలకాలకు పరిమితమైన ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అనే విషయం ఇప్పటికే రుజువైందన్నారు. గత ఎన్నికల్లో కొన్ని గ్రామాల్లో మాకు మెజారిటీ రాకున్నా ఆయా గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ పథకాలు అమలవుతున్నా వారికి అధికారం వచ్చేస్తుందని చంద్రబాబు, ప్రతిపక్ష నేతలు పగటికలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో భాగంగా వడ్లపూడి, గొట్లపాళెం గ్రామాల్లో రూ.1.15 కోట్లతో పూర్తి చేసిన సీసీరోడ్లు, మురుగు కాలువలను మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.2 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తిక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటేష్, ఈగా సురేష్, నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిశోర్‌నాయుడు, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తులసీరాం, కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం.. వలంటీర్ల వ్యవస్థ



అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : మన రాష్ట్రంలో అమలవుతున్న గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు సంఘమిత్ర కార్యాలయ సమీపంలో సోమవారం ఏర్పాటు చేసిన వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారి గొప్ప పనితీరుకు నిదర్శనంగా పలు రాష్ట్రాల్లో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. అలాంటి వ్యవస్థపై పచ్చ పత్రికలు అసత్య వార్తలు రాయడం సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న గౌరవ వేతనంతో తాము సంతోషంగా ఉన్నామని వాలంటీర్లు స్వచ్ఛందంగా చెబుతున్నారని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో వలంటీర్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతం చేయబోతున్నారని, అది మీరే చూస్తారన్నారు. అనంతరం ఆశా వర్కర్లకు రక్షణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అవార్డులు పొందిన వారు

కోవూరు-4 సచివాలయంలో పనిచేస్తున్న కన్న హారికకు సేవావజ్ర అవార్డు వరించింది. అలాగే సేవారత్న అవార్డులకు కోవూరు -4కు చెందిన వెంకట కృష్ణ, ఇనమడుగుకు చెందిన మానస, కోవూరు -4కు చెందిన శనగల కవిత, కోవూరు -5కు చెందిన పెంద్యాల భారతి, పడుగుపాడు -2కు చెందిన తలపల సునీల్ ఎంపికయ్యారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎమ్మెల్యే సాయం

పది పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన షేక్.మొబీనా సుల్తానా(586)కు ఎమ్మెల్యే ప్రసన్న సొంత నిధుల నుంచి రూ.25 వేలను అందించారు. అలాగే పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి రూ.10 వేలు నగదును అందజేశారు.

వ్యవసాయాధారిత జీవనోపాధిపై సమావేశం



శాస్త్రవేత్తలతో సమావేశమైన ఫౌండేషన్ ప్రతినిధులు

ముత్తుకూరు : అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు పేదలకు వ్యవసాయ ఆధారిత జీవనోపాధి కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లలిత శివజ్యోతితో ఫౌండేషన్ సీఎస్సార్ హెడ్ రాజేష్ రంజన్ సమావేశమయ్యారు. కృష్ణపట్నం, నారికేళపల్లి, ఈపూరు వెంకనపాళెం, ముత్తుకూరు పంచాయతీలకు చెందిన పేద మహిళల ఆర్థికాభివృద్ధి చేపట్టాల్సిన కార్యక్రమాలు చర్చించారు. హోమ్‌సైన్సు సైంటిస్ట్ డాక్టర్ సుజాత, సస్టైనబుల్ లవ్లీహుడ్ డెవలప్‌మెంట్ సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ రమేష్‌బాబు సమావేశంలో పాల్గొన్నారు. జీవనోపాధికి ఎంపిక చేసిన కార్యక్రమాలను జూన్ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.

నేడు బుచ్చిలో 'గడప గడపకు..'

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని 6, 7 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, టౌన్ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 7 నుంచి జరిగే కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి స్థానిక సమస్యలు తెలుసుకుంటారని వివరించారు.

మొలక పోలేరమ్మకు పంచామృతాభిషేకం

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన మొలక పోలేరమ్మకు జాతర నేపథ్యంలో సోమవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అలాగే హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ప్రధాన ఘట్టమైన జాతర మంగళవారం జరుగనుంది. ఈ మేరకు కార్యక్రమ నిర్వాహకులు ఏర్పాట్లును పూర్తి చేశారు. జాతర సందర్భంగా గ్రామంలో కోలహలం నెలకొంది.

డ్రోన్ పిచికారీపై అవగాహన



సూచనలు చేస్తున్న ఏరో స్పేస్ ప్రతినిధి

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గరుడా ఏరో స్పేస్‌కు చెందిన ప్రతినిధులు, కిసాన్ డ్రోన్ డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాసరెడ్డి సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే రైతులకు ఖర్చులతో పాటు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.శివనాయక్, ఏఓ ఎ.వాసు, ఉపసర్పంచ్ పామూరు లచ్చారెడ్డి, చుట్టుపక్కల ఆర్బీకేలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు



నిడిగుంటపాళెం రైతు భరోసా కేంద్రానికి చేరిన యూరియా బస్తాలు

వెంకటాచలం : మండలంలో రెండో పంట సాగు చేసే రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీకి అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేశామని మండల వ్యవసాయాధికారి హరి కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలంలోని రైతు భరోసా కేంద్రంలో మండలంలో ఎరువుల నిల్వల గురించి సోమవారం మాట్లాడారు. మండలంలోని ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, తిక్కవరప్పాడు, కంటేపల్లి, గొలగమూడి, అనికేపల్లి, కనుపూరు, కసుమూరు, పాలిచెర్లపాడు తదితర గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో రెండో పంట వరిసాగుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలియజేశారు. ప్రస్తుతానికి ప్రతి రైతు భరోసా కేంద్రంలో యూరియా నిల్వ చేసినట్లు పేర్కొన్నారు. డీఏపీతో పాటు ఇతర ఎరువులను కూడా నిల్వ ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి దేవదాయ శాఖ, బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కిస్తారని వివరించారు.

హైస్కూల్ ప్లస్‌కు అధ్యాపకుల నియామకం



హెచ్‌ఎం సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన అధ్యాపకులు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌కు ఏడుగురు అధ్యాపకులను డీఈఓ ఆర్.గంగాభవాని నియమించారు. ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులకు రెగ్యులర్ అధ్యాపకులను నియమించగా, వారంతా పాఠశాల హెచ్‌ఎం డి.ఓబులేసు సమక్షంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతేడాది విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ హైస్కూల్ ప్లస్‌ను ప్రవేశ పెట్టగా, అర్హులైన ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై అధ్యాపకులుగా బోధన చేస్తూ వచ్చారు. ఇక్కడ రెగ్యులర్ అధ్యాపకుల ఆవశ్యకతను గుర్తించిన డీఈఓ ప్రత్యేక చొరవ చూపి అవసరమైన అధ్యాపకులను రెగ్యులర్‌గా నియమించారు. దీంతో ఎంఈఓ జి.వసంతకుమారి, హెచ్‌ఎం ఓబులేసులు డీఈఓకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఏడేళ్ల సమస్యకు పరిష్కారం

• పేదలకు పట్టాలు రాకుండా టీడీపీ కుయుక్తులు
• ఎట్టకేలకు నిరుపేదలకు ఇళ్ల స్థలాలు



లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

పొదలకూరు : పేదలకు మేలు జరిగితే టీడీపీ నేతలకు నచ్చదు. వారు పట్టాలు పొందితే తమ ఉనికి కోల్పోతామని గ్రహించి దానిని అడ్డుకునేందుకు అడ్డగోలుగా ప్రయత్నిస్తుంటారు. ఇందుకోసం న్యాయస్థానాలను సైతం ఆశ్రయించి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిలిపి వేస్తుంటారు. అయితే అంతిమంగా న్యాయమే విజయం సాధించి నిరుపేదలకు పట్టాలు అందుతున్నాయి. మండలంలోని ముదిగేడు గ్రామంలో ఏడేళ్లుగా రజకులు, గిరిజనులు నివేశన స్థలాల కోసం ఎదరు చూస్తున్నారు. చివరకు 'గడప గడకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా పట్టాలను నాలుగు రోజుల క్రితం అందుకుని సంతోషం వ్యక్తం చేశారు.

కాకాణి కృషి ఫలితం

ఏడేళ్ల కిందట టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మండలంలోని ముదిగేడు గ్రామంలో సర్వేనంబర్ 258లో ఉన్న ప్రభుత్వ భూమి సుమారు ఎకరా స్థలంలో ఒకరిద్దరు గిరిజనులు ఉండేవారు. అయితే అక్కడ రజకులకు కూడా నివేశన స్థలాలు అందజేసి అందరికీ న్యాయం చేసేందుకు పంచాయతీ తీర్మానం ద్వారా స్థలాలను అందజేసే ప్రయత్నం చేశారు. ఇది ఇష్టం లేని టీడీపీ నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. దీనిపై అప్పటి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి న్యాయస్థానాల్లో పిటిషన్ వేసి లబ్ధిదారుల ద్వారా పోరాటం చేశారు. ఎట్టకేలకు న్యాయస్థానంలో స్టే తొలగిపోవడం, ఈలోగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో పేదలకు నివేశన స్థలాలు అందజేసేందుకు మార్గం సులువైంది. ఫలితంగా ఉన్న స్థలాన్ని సర్వే చేయించి మొత్తం 31 ప్లాట్లను ఏర్పాటు చేసి 14 మంది రజకులు, 17 మంది గిరిజనులకు మూడు సెంట్ల వంతున స్థలాలను అందజేశారు.


త్వరలో ఇళ్ల నిర్మాణం

పంపిణీ చేసిన స్థలాల్లో త్వరలో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను కూడా చేపడుతుందని మంత్రి కాకాణి ప్రకటించారు. అంతేకాకుండా ఇల్లు నిర్మించుకోలేని గిరిజనులకు గృహనిర్మాణ శాఖ అందించే రూ.1.80 లక్షలు పోను అదనంగా ఇంటికి అయ్యే ఖర్చును తాను సొంతంగా భరిస్తానని మంత్రి వెల్లడించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ లేఅవుట్లో ఇళ్లను నిర్మిస్తామన్నారు. సొంతంగా ఇంటిని నిర్మించుకునే వారికి వెంటనే పక్క ఇళ్లను మంజూరు చేస్తామన్నారు.



ముదిగేడులో పేదల కోసం నిర్మించిన లేఅవుట్


మరచిపోలేం



నివేశన స్థలాల పంపిణీ విషయంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన కృషిని మరిచిపోలేం. ఆయన మా తరఫున పోరాడి ఇంటి స్థలాలను అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నేతలు కూడా సహకారం అందించారు.

– జి.సుధాకర్, లబ్ధిదారుడు, ముదిగేడు


ఎన్నో అవాంతరాలు



పేదలకు నివేశన స్థలాలు అందజేసేందుకు టీడీపీ నేతలు ఎన్నో అవాంతరాలు సృష్టించారు. న్యాయస్థానాలను ఆశ్రయించి కొంత కాలం స్థలాలను అందజేయకుండా అడ్డుకున్నారు. మంత్రి కాకాణి పట్టుబట్టి అందరికీ న్యాయం జరిగేలా సహకారం అందించారు.

– పెదమల్లు రమణారెడ్డి, మాజీ సర్పంచ్, ముదిగేడు

పేదలకు పట్టాలు



ముదిగేడుకు చెందిన 31 మంది పేదలకు నివేశన స్థలాలకు సంబంధించి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి కాకాణి చేతులమీదుగా పట్టాలను అందజేశారు. ఉన్న స్థలంలో సర్దుబాటు చేసి దాదాపుగా అందరికీ ప్లాట్లు వచ్చే విధంగా లేఅవుట్ నిర్మాణం జరిగింది.

– ఐఎస్ ప్రసాద్, తహసీల్దార్, పొదలకూరు

సిమెంట్‌రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేతలు

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సిమెంటురోడ్డు పనులను సర్పంచ్ చిట్టెమ్మ చేతులమీదుగా సోమవారం ప్రారంభించారు. నుడా నిధులు రూ.16 లక్షలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని మంజూరు చేయించడంతో పనులను ప్రారంభించినట్లు ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. ఇటీవల మంత్రి దేవస్థానానికి విచ్చేసిన సందర్భంగా పాలక మండలి సభ్యులు సిమెంటురోడ్డు అవసరమని చెప్పారని, వెంటనే స్పందించిన ఆయన రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ తన్నీరు సుబ్రహ్మణ్యం, వార్డుసభ్యులు అంజాద్, హేమంత్, హరి, భాస్కర్, దేవస్థానం కమిటీ సభ్యులు రఘురామిరెడ్డి, శ్యామ్‌ప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మురళీ, వైఎస్సార్‌సీపీ నేతలు భాస్కర్, శివశంకర్, విజయభాస్కర్‌రెడ్డి, ఆనందరావు, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నిడిముసలి గ్రామస్తులు

ఇందుకూరుపేట : ఉపాధి హామీ పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్వరి అక్రమాలకు పాల్పడుతోందని, ఆమెపై చర్యలు చేపట్టాలని మండలంలోని నిడిముసలి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరి పనికి రాని వాళ్లను వచ్చినట్లుగా చూపుతూ రూ.లక్షలు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఏపీఓ జ్యోతి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అనంతరం ఎంపీడీఓ కె.నాగేంద్రబాబుకు వినతి పత్రం సమర్పించారు.

బీపీపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు (అర్బన్): గర్భందాల్చినప్పుడు కనిపించే బీపీ ప్రమాదకరమని, అందువల్ల గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రసూతి విభాగాధిపతి గీతాలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ ప్రీఎక్లాంప్సియా (ఫిట్స్) దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలోని గర్భిణులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాలక్ష్మి మాట్లాడుతూ బీపీ 140/90 కన్నా ఎక్కువ ఉంటే ప్రమాదకరమన్నారు. మొదటిసారి కాన్పు జరిగేటప్పుడు, పెద్ద వయస్సు లేదా అతిచిన్న వయస్సులో గర్భం దాల్చినప్పుడు బీపీ వల్ల ఫిట్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. గర్భిణుల్లో 23 శాతం మరణాలకు దారితీస్తుందన్నారు. వాంతులు, వికారం, కుడివైపు లివర్‌లోనొప్పి, యూరిన్ సరిగా రాకపోవడం, తదితర లక్షణాలు ఉంటే తక్షణమే గైనకాలజిస్టును కలిసి బీపీ చెక్ చేయించుకోవాలని సూచించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



కొడవలూరు : మండలంలోని కమ్మపాళెంలో ఉపాధి కూలీలకు కొడవలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ కె.పద్మజ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే సబ్ సెంటర్‌లో సంప్రదిస్తే తగిన చికిత్స అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ బి.పద్మ, హెచ్ఏలు టి.రాధమ్మ, సీహెచ్.సుధాకర్, ఆశా కార్యకర్త డి.రాజేశ్వరి పాల్గొన్నారు.